క్లుప్తంగా

సీతారాముల కల్యాణానికి రావాలని ఎంపీకి ఆహ్వానం

మణికొండ: వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అలకాపూర్ టౌన్‌షిప్ మహాత్మాగాంధీ పార్కు రోడ్డులో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డికి సభ్యులు ఆహ్వానపత్రిక అందించారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అసోసియేషన్ సభ్యులు ఆయనను కలిసి ఆహ్వానపత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పేపర్ లీక్ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించండి

శంషాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ ఘటనపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చాకలి మహేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరుద్యోగ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా విభాగ్ కన్వీనర్ క్లాం సూర్యకుమార్ మాట్లాడుతూ.. పేపర్ లీకేజీపై సీఎం కేసీఆర్ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్సీ చైర్మన్, మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రదీప్, మణికంఠ, అఖిల్, రాకేష్, పవన్, భార్గవ్, చరణ్‌దీప్, భారత్, శివ, భార్గవి, మేఘన, ఇందు, అఖిలాండేశ్వరి పాల్గొన్నారు.

మీటింగ్ హాల్ ప్రారంభం

మణికొండ: ఇరుకుగా ఉన్న మణికొండ మున్సిపాలిటీ భవనం పైఅంతస్తులో ఇటీవల నిర్మాణం చేపట్టిన సమావేశం హాల్‌ను బుధవారం చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన మున్సిపల్ కార్యాలయం ల్యాంకోహిల్స్ పక్కన రూ.8 కోట్ల నిధులతో నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న కార్యాలయం సిబ్బంది పని చేసేందుకు, సమావేశాలు నిర్వహించేందుకు అనుకూలంగా లేకపోవడంతో రెండవ అంతస్తులో సమావేశ హాల్ నిర్మాణం చేపట్టామన్నారు. నూతన భవనానికి మున్సిపల్ కార్యాలయం తరలించాక ప్రస్తుత భవనాన్ని ప్రజా అవసరాలకు వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, మేనేజర్ మల్లారెడ్డి, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సహకార సంఘం సర్వసభ్య సమావేశం

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. రైతులకు అందజేసే స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలతో పాటు పంట రుణాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో చైర్మన్ బి.దానాకర్‌గౌడ్, డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, మోహన్‌రావు, రూప, బాల్యానాయక్, సర్పంచులు మహేందర్‌రెడ్డి, సతీష్‌యాదవ్, ఉప సర్పంచులు జగన్‌మోహన్‌రెడ్డి, సురేందర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

శంషాబాద్ రూరల్: మండలంలోని అమ్మపల్లి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి ప్రారంభించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. అంతకుముందు డీసీపీ పెద్దషాపూర్‌లో ఉన్న శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఏసీపీ భాస్కర్‌గౌడ్, డీఐ బోస్ కిరణ్, ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్, ఎస్‌ఐలు బలరాం, సరిత, ప్రశాంత్‌రెడ్డి, రాజ్‌కుమార్, జెడ్పీటీసీ తన్వీరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన సుదర్శన్‌ప్రసాద్ తివారీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అత్తాపూర్‌కు చెందిన టీపీసీసీ మాజీ కార్యదర్శి, జాతీయ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ ప్రసాద్ తివారీ బీజేపీలో చేరారు. మంగళవారం సాయంత్రం బీజేపీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ సమక్షంలో పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. అత్తాపూర్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో సాధారణ కార్యకర్త నుంచి టీపీసీసీ కార్యదర్శి వరకు పదవులు నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితమై పార్టీలో చేరినట్లు ఆయన చెప్పారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

మణికొండ: కుటుంబ కలహాలతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో బుధవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ సమరంరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ రాంనగర్‌కు చెందిన దంపతులు రాఘవేందర్, సారిక సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వారు అలకాపూర్ టౌన్‌షిప్‌లోని శ్రీవారి హైట్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సారిక (33) మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం లేచి చూసిన భర్త పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారికి మూడేళ్ల కుమార్తె ఉంది. భర్త వేధింపులతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సారిక తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అభివృద్ధే అజెండా..!


మణికొండ మున్సిపల్ సమావేశం దృశ్యం

నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల బడ్జెట్ సమావేశాలు

- పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు
- నార్సింగి బడ్జెట్ రూ.119.50 కోట్లు
- మణికొండ బడ్జెట్ రూ.56.33 కోట్లు

మణికొండ: కొన్ని నెలల్లోనే శాసనసభ ఎన్నికలు ఉన్నాయని, ఈ లోపు గతంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయండంతో పాటు అభివృద్ధే అజెండాగా పనిచేద్దామని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ డి.రేఖాయాదగిరి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం రెండు మున్సిపాలిటీల వార్షిక బడ్జెట్ సమావేశాలు, సర్వసభ్య సమావేశాలు నిర్వహించి పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వార్డులలో ప్రజలకు ఎదురవుతున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి వెంటనే పనులను చేపట్టాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయం, చేసే ఖర్చుల వివరాలను కమిషనర్‌లు వి.సత్యబాబు, కె.ఫల్గుణ్‌కుమార్‌లు సభ్యులకు వివరించారు.


నార్సింగి మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

నార్సింగి మున్సిపాలిటీ ఆదాయం,ఖర్చులు.

నార్సింగి మున్సిపాలిటీకి వచ్చే సంవత్సరం రూ.119.50 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా బడ్జెట్‌లో చూపించారు. అందులో పన్నుల రూపంలో రూ.29.26 కోట్లు, టౌన్ ప్లానింగ్ ద్వారా రూ.43 కోట్లు, నాన్‌గ్రాంట్ ద్వారా రూ.2.82 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. వాటి నుంచి రూ.4.91కోట్లు జీతాలు, రూ.5.08 కోట్లు శానిటేషన్‌కు, విద్యుత్ బిల్లులకు రూ.3.25 కోట్లు, గ్రీనరీ కోసం రూ.7.44కోట్లు, అభివృద్ధి పనులకు రూ.7.84కోట్లు, ప్రజా అవసరాలకు రూ.7.90కోట్లు, వార్డుల వారీగా రూ.48.35 కోట్లు ఖర్చు చేయాలని తీర్మాణం చేశారు.

మణికొండ మున్సిపాలిటీ తీర్మాణాలు..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.53.33కోట్లను ఖర్చుచేయాలని బుధవారం జరిగిన సమావేశంలో తీర్మాణం చేశారు. అందులో నూతన మున్సిపాలిటీ కార్యాలయానికి రూ.8కోట్లు, పంచవటి కాలనీ బాక్స్ డ్రైన్‌కు రూ.9.80కోట్లు, మార్కెట్‌కు రూ.కోటి, దోభీఘాట్‌కు రూ.2 కోట్లు, కమ్యూనిటీహాళ్లకు రూ.2.23కోట్లు, రోడ్లకు రూ.2.18కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.6.13కోట్లు, ఎస్సీ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.1.76కోట్లు, మార్కెట్ యార్డుకు రోడ్డు, బాక్స్ డ్రైన్ పనులకు రూ.7.50కోట్లు, శానిటేషన్ పనులకు రూ.3.24కోట్లు, డ్రైనేజీ పైప్‌లైన్లకు రూ.2.20కోట్లు, ఇతర పనులకు రూ.9.33కోట్లు కేటాయించాలని తీర్మాణాలు చేశారు. ఈ సమావేశాల్లో మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌లు జి.వెంకటేశ్ యాదవ్, కె.నరేందర్‌రెడ్డి, జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి, విద్యుత్, ఇంజినీరింగ్ అధికారులతో పాటు కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాల్సిందే

– పీసీసీ కార్యదర్శి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో వందల కోట్ల విలువైన హెచ్‌ఎండీఏ భూముల కబ్జాకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని పీసీసీ కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సర్వే నంబర్ 720 నుంచి 730 వరకు ఉన్న యాభై ఎకరాల్లో కబ్జా చేసిన భూముల్లో ఉన్న ఇళ్లు, షెడ్లను హెచ్‌ఎండీఏ ప్రత్యేక ఆపరేషన్ ద్వారా కూల్చివేసిన సంగతి తెలిసిందే. బుధవారం సంబంధిత భూములను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. కోట్ల రూపాయల విలువైన భూములను బీఆర్‌ఎస్ నేతల ప్రాద్బలంతోనే కబ్జాకు గురవుతున్నాయన్నారు. కబ్జాల్లో ఆరితేరిన ఓ నేత బంధువులే దీనికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని, ప్రభుత్వానికి తెలిసినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. కబ్జాల వెనుక ఓ ప్రజాప్రతినిధి అల్లుడి పాత్ర ఉన్నట్లు విమర్శలు వస్తున్నా సమాధానం ఎందుకు చెప్పడం లేదన్నారు. కబ్జాదారులపై హెచ్‌ఎండీఏ అధికారులు కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్, నాయకులు కోటేశ్వర్‌గౌడ్, నవీన్, బొబ్బిలి శేఖర్, పి.శ్రీధర్‌యాదవ్, నజీర్‌భాయ్, ఉమామహేష్, నవీన్, చందుయాదవ్, పాండుయాదవ్, రాకేష్, అభిషేక్, జహంగీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న పీసీసీ కార్యదర్శి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు

అక్రమ లేఅవుట్‌లలో కొత్త కోణం..!

- ఒకే ఇంటి నంబర్‌తో పలు ప్లాట్ల విక్రయం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదుల వెల్లువ

శంషాబాద్: అక్రమ లే అవుట్ల దందాల్లో మరో కొత్త కోణం వెలుగుచూసింది. ఒక ఇంటి నంబర్ ఆధారంగా పలు ప్లాట్లను విక్రయించి రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై ఇటీవల స్థానికులు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం.

ఏం జరిగిందంటే..

స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ మరిది (భర్త సోదరుడు) పట్టణంలోని మధురానగర్ కాలనీలో రెండెకరాల్లో లేఅవుట్‌కు శ్రీకారం చుట్టాడు. ఇందులో కొన్నేళ్ల కిందట రెండు చిన్నపాటి గదులకు తీసుకున్న ఇంటి నంబర్ల ఆధారంగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియ ప్రారంభించాడు. ప్రతి ప్లాటుకు ఒకే ఇంటి నంబర్ 23-182/ఈ/6/7 పార్ట్‌తో పాటు పీటీఐఎన్ నంబరు 11995086621తో రిజిస్ట్రేషన్లు చేయించారు. ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధంగా జరిగింది. ఖాళీ స్థలాలకే ఒకే ఇంటి నంబరుతో పాటు పీటీఐఎన్ నంబరు వినియోగించడానికి అవకాశం లేదు. అయితే ఇలా ఇప్పటి వరకు ఐదు ప్లాట్ల విక్రయాలు జరిగినట్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులే ధ్రువీకరించారు. ఇందులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పనిచేసే డాక్యుమెంట్ రైటర్ల హస్తంతో పాటు అధికారులు సైతం కుమ్మక్కై ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇల్లు లేకున్నా ఖాళీ స్థలానికి ఇల్లు ఉన్నట్లు రిజిస్ట్రేషన్ చేసిన తీరు చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై స్థానికులు కొందరు ఇప్పటికే జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, సీఎంఓలకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

తప్పుదోవ పట్టించారు

ఒకే పీటీఐఎన్ నంబర్‌తో అనేక ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలు లేదు. దీనిపై కార్యాలయాన్ని తప్పుదోవ పట్టించారు. సమగ్ర విచారణ చేసి ఇప్పటి వరకు చేసిన వాటిని నిలుపుదల చేస్తాం. ఇకపై ఒకే ఇంటి నంబర్, పీటీఐఎన్ నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకుంటాం.

– బాల్‌రాజ్, శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్


ఇల్లు లేకున్నా ఉన్నట్లు రిజిస్ట్రేషన్ చేసిన ఖాళీ ప్లాట్లు.. అక్రమ అలేవుట్ ఇదే..

ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తాం

రాజేంద్రనగర్: ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని మైలార్‌దేవ్‌పల్లి జలమండలి కార్యాలయంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ వినాయక్ మాట్లాడుతూ.. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని తాగునీటిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తున్నామని, గుంతలను ఏర్పాటు చేసేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇంకుడు గుంతలతో వర్షపు నీరు భూమిలోకి చేరి నీటి మట్టం పెరుగుతుందన్నారు. ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంత ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, ఇంతియాజ్ అహ్మద్, వెంకటేష్, మనీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న సర్పంచ్‌లకు అభినందన

శంషాబాద్ రూరల్: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం అందుకున్న సర్పంచులను ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అభినందించారు. మల్కారం, కవ్వగూడ పంచాయతీలకు జిల్లా స్థాయి పురస్కారాలు రావడంతో ఆయా పంచాయతీ సర్పంచులు మాధవియాదగిరిరెడ్డి, రమేష్ యాదవ్ బుధవారం ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ సర్పంచులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తన్వీరాజు, ఉప సర్పంచ్ లలితాజంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న 13 మంది రిమాండ్

రాజేంద్రనగర్: పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకోని రిమాండ్‌కు తరలించిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదర్‌గూడలోని శివానగర్ కాలనీలో ఓ ఇంట్లో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ఇంటిపై దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 13 సెల్‌ఫోన్లు, రూ.90 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఎండీఏ స్థలంలో ఆక్రమణల తొలగింపు



మణికొండ: గండిపేట మండలం నార్సింగి రెవెన్యూ పరిధిలో హెచ్‌ఎండీఏకు చెందిన స్థలాన్ని ఆక్రమించుకొని వేసిన రేకుల షీట్‌లను ప్రత్యేక బృందం బుధవారం తొలగించింది. జయభేరి క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న 2 వేల గజాల హెచ్‌ఎండీఏ స్థలాన్ని రేకుల షీట్‌లు ఏర్పాటు చేసి కబ్జాకు పాల్పడ్డారు. బుధవారం ఉదయం వచ్చిన ప్రత్యేక బృందాలు జేసీబీలతో వాటిని పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. సదరు నిర్మాణ సంస్థ తమ స్థలం అక్కడి వరకు ఉందని అధికారులతో వాగ్వివాదానికి దిగినా పట్టించుకోకుండా షీట్‌లను తొలగించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి



రాజేంద్రనగర్: ఓఆర్‌ఆర్‌పై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఖలీల్ పాషా తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక బీదర్ జిల్లా ఉమ్నాబాద్‌కు చెందిన రేవనసిద్ధా(36) కారు డ్రైవర్. ఉమ్నాబాద్‌కు చెందిన ఓ కుటుంబం విదేశాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తుండడంతో వారిని తీసుకువెళ్లేందుకు రేవనసిద్ధా వచ్చాడు. ఉమ్నాబాద్ నుంచి బయలుదేరిన అతడు హిమాయత్‌సాగర్ ఓఆర్‌ఆర్ వద్దకు రాగానే ఎదురుగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రేవనసిద్ధా అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మణికొండ: మున్సిపాలిటీలలో ప్రజల అవసరాలను తీర్చినపుడే అధికారులు, ప్రజాప్రతినిధులను వారు గుర్తిస్తారని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఎదురుగా రూ.10లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లు, 4వ వార్డు హుడా కాలనీలో రూ.80లక్షలతో అభివృద్ధి చేసిన చాచా నెహ్రూ పార్కు, ఒపెన్ జిమ్‌లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు జీవో నెంబర్ 58 పథకం కింద మంజూరైన పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్లు సంగీతాగౌరీశంకర్, అర్చనాజయప్రకాష్ హాజరయ్యారు. జీవో నెంబర్ 58 కింద 41 మంది, కల్యాణలక్ష్మి ద్వారా 31 మంది, షాదీముబారక్ పథకం ద్వారా 379 మందికి మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక మందికి సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, రగడంపల్లి శ్రావణ్, సాయిమాలిక్, మజ్జిగ నరేష్‌యాదవ్, సుబ్బారావు, నవీన్, పడమటి శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌గౌడ్, రఘుయాదవ్, సరికొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటి పన్ను, నల్లా బిల్లులను తగ్గించాలి'


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బండ్లగూడ: పన్నుల రూపంలో ప్రజల రక్తం పీలుస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. గండిపేట మండలం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇంటి పన్నులు, నల్లా బిల్లులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇంటి పన్నులు, నీటి బిల్లుల ద్వారా ప్రజల రక్తాన్ని పీలుస్తున్నారన్నారు. కాలనీల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వాటిని పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధిలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వెంటనే ఇంటి పన్నులు, నల్లా బిల్లులను తగ్గించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు మరింత ఉధృతం ఆయన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఏ-బ్లాక్ అధ్యక్షుడు నవీన్, పాపిరెడ్డి, టింకురెడ్డి, సంగారెడ్డి, ప్రవీణ్, భాస్కర్, చందు, శ్రీనివాస్, అద్నాన్ సిద్ధిఖీ పాల్గొన్నారు.

ప్రతి కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణం


పనులను ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

మణికొండ: స్థలం అందుబాటులో ఉన్న ప్రతి కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపడుతున్నామని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన రూ.23.99 లక్షలతో చిత్రపురి కాలనీలో నిర్మాణం చేయనున్న కమ్యూనిటీహాల్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే స్థలం అందుబాటులో ఉన్న కాలనీల్లో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి తీర్మాణాలు చేసి పనులు ప్రారంభించామన్నారు. వాటిల్లో కొన్ని పూర్తి కావస్తుండగా మరి కొన్ని పనులు జరుగుతున్నాయన్నారు. వేల మంది నివసించే చిత్రపురి టౌన్‌షిప్‌లో కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపడితే స్థానికుకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు వి.హైమాంజలి అనిల్‌కుమార్, వసంతరావు, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వి.అనిల్‌కుమార్, ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి రమణ, సంయుక్త కార్యదర్శి బాలాజీ, కోశాధికారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ జాగీరు మున్సిపాలిటీ బడ్జెట్ ఆమోదం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్పొరేషన్ పరిధిలో 2023-24 సంవత్సరానికి బడ్జెట్‌ను రూ.6436.76 లక్షల రూపాయల అంచనాతో రూపొందించారు. అంచనా ఖర్చు వివరాల ప్రకారం జీతాలు, వేతనాల ఖర్చుకు 734.58 లక్షలు, శానిటేషన్ విభాగం ఖర్చు 488.50, కరెంట్ చార్జీలు 358.00, గ్రీన్ బడ్జెట్ ఖర్చు 452.27, ఇంజనీరింగ్ విభాగం ఖర్చు 1018.00, పరిపాలన నిర్వహణ ఖర్చు 264.30, టౌన్‌ప్లానింగ్ విభాగం 55.00, 1/3 బడ్జెట్ ఖర్చు 384.02, పబ్లిక్ ఎమినిటీస్ ఖర్చు 121.00, వార్డుల వారీగా ఖర్చు 1952.00 డిపాజిట్ల ఖర్చు 275.00, నాన్ ప్లాన్ గ్రాంట్లు 322.00, ప్లాన్ గ్రాంట్ 12.00 లక్షలు ఉంది. మొత్తం అంచనా బడ్జెట్ 6648.81 లక్షలుగా రూపొందించారు. ఈ సందర్భంగా 2023-2024 అంచనా ఆదాయ వివరాలను రూపొందించారు. పన్ను ఆదాయం 2384.65, అద్దె/ పెనాల్టీ ఆదాయం 110.06, ట్రేడ్ లైసెన్స్/పెనాల్టీల ఆదాయం 61.00, టౌన్‌ప్లానింగ్ ఆదాయం 1960.00, ఇంజనీరింగ్ విభాగం ఆదాయం 7.00, డిపాజిట్ల ఆదాయం 275.00, నాన్ ప్లాన్ గ్రాంట్లు 322.09, ప్లాన్ గ్రాంట్ 12.00, అంచనా ప్రారంభ విలువ 1517.01 లక్షలుగా రూపొందించారు. మొత్తం అంచనా ఆదాయం 6648.81గా అంచనా వేస్తున్నారు. కౌన్సిల్ సభ్యులంతా చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు.

హరిహర క్షేత్రంలో నేడు సీతారాముల కల్యాణం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని హరిహర క్షేత్రం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని గురువారం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి ఆనంతాచారి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఉదయం నుంచే దేవాలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించి కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభిస్తామన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కె.జంగయ్య, వి.శ్రీరాములు, పి.రామకృష్ణ, వై.చిన్నమైనంద, చేలారం చౌదరి, వై.హరగోపాల్, వి.యాదగిరి, వై.శ్రీధర్, పి.యాదగిరి, కె.ప్రవీణ్, రాజు, రఘుగౌడ్, కె.రఘు, ఎం.మధు, రవిషిండే, కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాషా కాలనీలో ఇఫ్తార్ విందు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ముస్లింలు అందరూ పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలను విజయవంతంగా పూర్తి చేసి పండగను ఘనంగా జరుపుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ బషీర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పాషా కాలనీలో ఉన్న మహబూబ్ కన్వెన్షన్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలకు సన్మానం చేశారు.

